క్లుప్తంగా

అనుమతులు తప్పనిసరి

పాలకొండ రూరల్: వినాయక ఉత్సవాలు నిర్వహించాలనుకునే వారు తప్పనిసరిగా పోలీస్, ఎలక్ట్రికల్, ఫైర్ శాఖల నుంచి అనుమతి తీసుకోవాలని ఎస్సై కె. ప్రయోగమూర్తి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ సభ్యులు బాధ్యత వహించాలన్నారు. అశ్లీల నృత్యాలు ప్రదర్శించినా, డీజేలు వినియోగించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

పాలకొండ రూరల్: విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయని.. ఈ విషయంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎం.సింగుపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని మైదాన ప్రాంత గిరిజన గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. వైరల్ జ్వరాలు ప్రబలిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. చిన్నపాటి ఆరోగ్య సమస్య వచ్చినా తక్షణమే వైద్యసేవలు పొందాలన్నారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

భామిని: మండల పరిధిలోని వంశధార పరీవాహక ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు సోమవారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వంశధార పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్ఐ మణి ప్రభాకర్, వీఆర్వోలు చిన్నారావు, మోహన్‌దాస్, కర్ణ, తదితరులు తెలిపారు.

భక్త వరదాయిని పోలమాంబ



పోలమాంబ అమ్మవారు

పాలకొండ రూరల్: పురటాళ్ల పోలమాంబ భక్తుల కల్పతరువని ఆలయ అర్చకుడు వేమకోటి రవిబాబు అన్నారు. ఆలయ 15వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అధిక ధరకు ఎరువు విక్రయిస్తే చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ

గరుగుబిల్లి: అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రవిప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని ఖడ్గవలస జంక్షన్‌లోని ఎరువుల షాపుల్లో ఆయన సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రికార్డుల ఆధారంగా ఎరువుల నిల్వలు, వాటి నాణ్యత, విక్రయాల రసీదులను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరకు మాత్రమే ఎరువులు విక్రయించాలని, ఎమ్మార్పీ కన్నా అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ఆయన వెంట విజిలెన్స్ ఎస్ఐ రామారావు, మండల వ్యవసాయాధికారి జి.తేజేశ్వని తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



నూతన కార్యవర్గ సభ్యులు

పాలకొండ రూరల్: మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ పాలకొండ నియోజకవర్గ అధ్యక్షుడిగా దన్నాన ఆనందరావు, ఉపాధ్యక్షుడిగా వెన్నపు వెంకటరమణ, కోశాధికారిగా ఈయపు రమణ, జనరల్ సెక్రటరీగా చిన్ని సింహాచలం, కార్యదర్శిగా రెడ్డి కేశవరావు, తదితరులు ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా పి.రాంబాబు, భాస్కరరావుతో పాటు కార్యవర్గ సభ్యులుగా పలువురిని ఎన్నుకున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గరుగుబిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులంతా హాజరవుతున్నారని, అధికారులు పూర్తిస్థాయి అభివృద్ధి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

యూరియా కోసం పడిగాపులు



జోరువానలోనూ ఉద్దవోలు రైతుసేవా కేంద్రం వద్ద యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

- అన్నదాతకు తప్పని యూరియా ఇక్కట్లు
- పంపిణీ కేంద్రాల వద్ద బారులుతీరిన రైతులు
- అయినా కొంతమందికి ఎరువులు దొరకని వైనం

గరుగుబిల్లి: అన్నదాతకు యూరియా వ్యథలు తప్పడం లేదు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు మొదలైన నాటి దగ్గర నుంచి ఏదో సమస్య రైతును వెంటాడుతూనే ఉంది. సాగుకు సన్నద్ధమైనప్పుడు విత్తనాల సమస్య..ఇప్పుడు సాగు సమయంలో యూరియా సమస్య రైతుకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో ఖరీఫ్ సీజన్ వస్తుందనగానే సాగుకు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఇలా అన్నింటినీ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధం చేసి ఉంచేవారు. దీనికితోడు రైతుకు రైతు భరోసా పథకం ద్వారా ఏటా సాగు సాయం అందించేవారు. దీంతో వ్యవసాయం పండగలా జరిగేది. ఏ రైతూ పంట సాగుకు సంబంధించి దేనికోసం ఇప్పటిలాగా వెతలు పడాల్సిన పరిస్థితి లేదు. ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం మాత్రం రైతు సంక్షేమం విస్మరిస్తోంది. విత్తనాలు, ఎరువుల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తూ రైతుల పాలిట శాపంగా తయారైంది. ఈ నేపథ్యంలో కూటమి తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

యూరియా, డీఏపీ, పొటాష్ అవసరం..

ఈ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట సాగుకు రైతులకు యూరియా, డీఏపీ, పొటాష్ వంటి ఎరువులు అవసరం. ఈ ఏడాది ఆరంభం నుంచే యూరియా కొరత రైతులను వెంటాడుతోంది. అటు రైతు సేవా కేంద్రాల్లో గానీ ఇటు సొసైటీల్లో గానీ రైతులకు సరిపడ యూరియా లేకపోవడంతో ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించి అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో తమకు సాగుకు అధిక ఖర్చు అవుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే అతికష్టం మీద రైతు సేవా కేంద్రాలకు వచ్చిన ఎరువులను కూటమి నాయకులు సిఫార్సు చేసిన రైతులకే ఇస్తున్నారని, తమకు దొరకనివ్వడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ కారణంగానే కొన్నిచోట్ల రైతు సేవా కేంద్రాలకు అరకొరగా వచ్చిన ఎరువులు ఇలా వచ్చి అలా అయిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మార్పీకి అమ్మడం లేదు..

ప్రస్తుతం నెలకొన్న ఎరువుల కొరతను కొంతమంది వ్యాపారులు క్యాష్ చేసుకుంటున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదనుగా ఎమ్మార్పీ ధర కన్నా ఎక్కువ ధరకు ఎరువులు విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారని రైతులు మండిపడుతున్నారు. అధికారులు తనిఖీలు చేసి, ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని సూచనలు చేసినా వ్యాపారుల తీరు మారడం లేదని గగ్గోలు పెడుతున్నారు. ఎరువులు లేవని ఎంతమందికి ఎన్నిసార్లు విన్నపాలు చేసినా అధికారులెవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ఉద్దవోలుకు వచ్చినవి 260 బస్తాలే..

మండలంలోని ఉద్దవోలు రైతు సేవా కేంద్రానికి సోమవారం కేవలం 260 యూరియా బస్తాలే వచ్చాయి. ఈ కేంద్రం పరిధిలోని ఉద్దవోలు, దళాయివలస గ్రామాలకు చెందిన 550 మంది రైతులకు యూరియా అవసరం. వారందరికీ 260 బస్తాలు ఎలా సరిపోతాయని, ఇలాగేనా రైతు సమస్యలు తీర్చేదని పలువురు రైతులు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. పాలకులు, అధికారులు క్షేత్రస్థాయిలోకి వస్తే తప్ప తమ బాధలు కనిపించవని, రావాలని వచ్చి చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

యూరియా లేదని చెబుతున్నారు..



గరుగుబిల్లి, ఉల్లిభద్ర ప్రాంతాల్లో యూరియా అస్సలు లేదని చెబుతున్నారు. యూరియా కావాలనుకునే వారు పార్వతీపురంలోని ప్రైవేటు ఎరువుల షాపుల్లో దొరికే సేంద్రియ ఎరువులు కొనుగోలు చేసుకోవాలని వ్యాపారులు సలహా ఇస్తున్నారు. ఎక్కడా రైతులకు సరిపడ యూరియా లేదు. కొన్నిచోట్ల పంపిణీ చేసినా రైతులకు అవసరమైనన్ని బస్తాలు ఇవ్వడం లేదు. ఇలా అయితే ఎక్కువ ఎకరాల్లో సాగు చేసే వారు ఏం కావాలి. ఎక్కడికి వెళ్లి ఎరువులు తెచ్చుకోవాలి. ప్రభుత్వమే సరిపడ ఎరువులు ఇవ్వాలి.

–దాసరి ఆదినారాయణ, రైతు, ఉద్దవోలు గ్రామం

ఎవరూ పట్టించుకోవడం లేదు..



సాగు సమయం ప్రారంభం నుంచి రైతును కష్టాలు వెంటాడుతుంటే పట్టించుకునే నాథుడే లేడు. గతంలో యూరియా కోసం ఇబ్బందులు పడిన సందర్భాలు లేవు. ఇప్పుడు అదే సమస్య దండిగా ఉన్నా ఎవరూ పరిష్కారానికి చొరవ చూపడం లేదు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తున్నా..ప్రైవేటు షాపుల్లో ఇష్టానుసారంగా ఎరువులు విక్రయిస్తున్నా చర్యలు తీసుకునేవారేరీ..? ఇప్పటికైనా ఎరువులు పెద్దమొత్తంలో తెప్పించి, ఇవ్వాలి.

–గొట్టి పోలినాయుడు, రైతు, ఉద్దవోలు గ్రామం

బెంచీలు విరగ్గొట్టిన ఆకతాయిలు



విరిగిపోయిన బల్లలు

వీరఘట్టం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో 1999 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఏడాది కిందట ఏర్పాటు చేసిన బెంచీలను కొంతమంది ఆకతాయిలు విరగ్గొట్టారు. 8 బెంచీలు ఏర్పాటు చేయగా అందులో రెండింటిని విరగ్గొట్టారని హెచ్‌ఎం బి.సాంబర సోమవారం స్థానిక విలేకరులకు తెలియజేశారు. అందరికీ ఉపయోగపడే బెంచీలను నాశనం చేయడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు.

న్యాయ అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న జడ్జి సౌమ్య జోస్పిన్

కురుపాం:

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి సౌమ్య జోస్పిన్..వివిధ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండడం అవసరమని, అందరూ ఉన్నత విలువలు పాటిస్తూ ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజ్‌కుమార్, సోమయాజులు, ఏఎస్ఐ రమణ, ప్రిన్సిపాల్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

● మట్టి గణపతే మేలు..



ఎన్‌కె.రాజపురంలో మట్టి విగ్రహాలతో చిన్నారులు

పాలకొండ రూరల్: తొలి పూజకు మట్టి గణపతే సంప్రదాయ మూర్తి అని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలని స్థానిక ప్రభుత్వ పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు భౌరోతు శంకరరావు తెలిపారు.

మండల పరిధిలోని తుమరాడ, ఎన్‌కే రాజపురం గ్రామాల్లో పర్యావరణ ప్రేమికులు సోమవారం మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాల వల్ల కలిగే అనర్థాలను ఉపాధ్యాయుడు శంకరరావు ప్రజలకు వివరించారు.

ఎస్‌డీసీ కార్యాలయానికి సొంత భవనం నిర్మించాలి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట దగ్గరున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్‌డీసీ) కార్యాలయం భవనానికి సొంత భవనం నిర్మించాలని ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు సోమవారం విలేకరులతో మాట్లాడారు. గిరిజన ప్రాంతానికి ఎంతో ముఖ్యమైన ఎస్‌డీసీ కార్యాలయానికి సొంత భవనం లేనందున యూత్ ట్రైనింగ్ సెంటర్‌లోని ఓ గదిలో ఎస్‌డీసీ కార్యాలయం నిర్వహించాల్సి వస్తోందన్నారు. దీంతో అధికారులు వారికి సమస్యలు విన్నవించుకునేందుకు వస్తున్న వారు స్థలం కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే పాత భవనం మరమ్మతులు చేపట్టడం గానీ సొంత భవనం నిర్మించడం గానీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీఎంవో రఘుకుమార్

కురుపాం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా డీపీఎంవో పి.ఎల్.రఘుకుమార్ సూచించారు. మండలంలోని మొండెంఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం రోగుల వద్దకు వెళ్లి, వారికి అందుతున్న సేవలపై ఆరాతీశారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని, రోగులకు అవసరమైన సేవలు సక్రమంగా అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి గ్రామంలో ఫీవర్ సర్వే చేసి, జ్వరపీడితులను గుర్తించి వారికి వైద్యసేవలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో నాగేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ సుగుణ, హెల్త్ అసిస్టెంట్ జె.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రేగిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీపీఎంవో రఘుకుమార్ సోమవారం సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోగులకు నిత్యం అందుబాటులో ఉండాలని, మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు శంకరరావు, ఎంపీహెచ్‌ఈవో కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: మండలంలోని సుంకి గ్రామానికి చెందిన వేమల శేషగిరి అనే వ్యక్తి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి..సోమవారం ఆ గ్రామం వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శేషగిరి మరణానికి గల కారణాలు అడిగి తెలుసుకుని ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అక్కడి నుంచి ఇదే మండలంలోని లఖనాపురం వెళ్లి, ఆ గ్రామంలో మృతి చెందిన ముదిలి లక్ష్మంనాయుడు, తలచింతల పొట్టియ్యల తాలూకా కుటుంబాల సభ్యులను కలిసి పరామర్శించారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేలిరెడ్డి అచ్యుతరావు, నాయకులు వాకాడ కురిమినాయుడు, నేరేడిబిల్లి జనార్దననాయుడు, దూసి తిరుపతిరావు, ఉరిటి యాదవ్, తెర్లి ఎల్లంనాయుడు, శెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రానికి శంకుస్థాపన

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో ఉన్న అగ్నిమాపక కేంద్రం శిథిలావస్థకు చేరి అధ్వానంగా ఉండడంతో ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాత భవనాన్ని తొలగించి అదే ప్రాంతంలో రూ.2కోట్లు నిధులతో కొత్త భవనం నిర్మాణం చేపట్టనున్నారు. కొత్త భవనం నిర్మాణానికి జిల్లా అగ్నిమాపక శాఖాధికారి పి.సింహాచలం సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. జిల్లా కేంద్రానికి సరిపడా సామర్థ్యంతో భవనాన్ని నిర్మిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ జేఈ రాజుబాబు, కేంద్ర అధికారి జి.ప్రభాకరరావు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైసైకిల్, ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేసిన కలెక్టర్

పార్వతీపురం రూరల్: దివ్యాంగుడికి ట్రైసైకిల్, మరో ఇద్దరికి ల్యాప్‌టాప్‌లను కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పంపిణీ చేశారు. సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పార్వతీపురంలోని నిర్మల కాలనీకి చెందిన చింతాడ గుంపయ్య అనే దివ్యాంగుడు ట్రైసైకిల్ మంజూరు చేయాలని అర్జీ ఇవ్వగా తక్షణమే సంబంధిత అధికారులతో కలిసి అందజేశారు. అలాగే సాలూరు నుంచి రాజాన గీత, కొమరాడ నుంచి దత్తి విష్ణువర్ధన్ నాయుడు, తమకు ల్యాప్‌టాప్‌లు మంజూరు చేయాలని కోరగా కలెక్టర్ తక్షణమే స్పందించి వారికి ల్యాప్‌టాప్‌లను అందజేశారు.

25 మందిపై బైండోవర్

సాలూరు: వినాయక ఉత్సవాల నేపథ్యంలో 25మందిని బైండోవర్ చేసినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ గణేష ఉత్సవాల నేపథ్యంలో గత పరిస్థితుల దృష్ట్యా 25 మందిని తహసీల్దార్ వద్ద హాజరుపరిచినట్లు చెప్పారు. ఉత్సవాన్ని ప్రశాంతంగా జరపాలని తహసీల్దార్ సూచించారని, 25 మంది వ్యక్తులను బైండోవర్ చేసినట్లు తెలిపారు.

ఎరువుల కొరతతో అన్నదాతకు ఇక్కట్లు



సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

సీతంపేట: ఎరువుల కొరతతో ఏజెన్సీ ప్రాంత రైతులు ఇబ్బంది పడుతున్నారని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. సోమవారం సీతంపేట వచ్చిన ఆమెను స్థానిక ఎంపీపీ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల కొరత ఉందన్నారు. రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. బహిరంగ మార్కెట్‌లో వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తుండడంతో దిక్కుతోచని స్థితిలో గిరిజన రైతులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ ఇప్పటికైనా స్పందించి రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులు సరఫరా చేయాలని కోరారు. గ్రామాల అభివృద్ధికి కూడా నిధులు మంజూరు చేయలేని దుస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. ఏకగ్రీవ పంచాయతీలకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలు కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. చాలా మందికి హౌసింగ్ బిల్లులు కూడా చెల్లించలేదని తెలిపారు. రహదారులు అస్తవ్యస్తంగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని వాపోయారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎస్.లక్ష్మి, సర్పంచ్‌లు ఎ.కళావతి, హెచ్.ఆదిలక్ష్మి, ఎస్.సుశీల, బి.తిరుపతిరావు, ప్రవీణ్, రాజయ్య, ఎస్.తిరుపతిరావు, బాపయ్య, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.చంద్రశేఖరరావు, ఎస్టీ సెల్ జిల్లా కన్వీనర్ హెచ్.మోహనరావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ ఎస్.కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.సుమిత్రారావు, నాయకులు ఎస్.రాము, ఎస్.సాయికుమార్, వి.చలపతిరావు, వెంకటేష్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రబలుతున్న వ్యాధులు



చికిత్స పొందుతున్న చిన్నారులు

సీతంపేట: విస్తారంగా కురుస్తున్న వర్షాలకు చిన్నారులు వివిధ వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారు. జ్వరం, ఇతర వ్యాధులతో ఏరియా ఆస్పత్రికి వచ్చే చిన్నారులతో ఆస్పత్రి కిటకిటలాడుతోంది. కొద్ది రోజులుగా చిన్నారుల వార్డులో బెడ్లు ఖాళీగా లేవంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సోమవారం ఓపీకి 203 మంది చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు రాగా అందులో 70 మంది జ్వరాలతో బాధపడుతున్నట్లు వైద్య సిబ్బంది గుర్తించారు. ఇందులో 34 మందిని ఇన్‌పేషెంట్లుగా జాయిన్ చేసినట్లు ఆస్పత్రి సూపరింటిండెంట్ బి. శ్రీనివాసరావు తెలిపారు.

నేటితో ముగియనున్న ప్రవేశాల గడువు



అధ్యాపకుల ఆధ్వర్యంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ

పాలకొండ రూరల్: డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మంగళవారంతో ముగియనుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ మానుకొండ శ్యాంబాబు అన్నారు. తమ కళాశాలలో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ఆన్‌లైన్ ప్రక్రియను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఏ ఎకానమిక్స్, పొలిటికల్ సైన్స్, బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, జనరల్, బీఎస్సీ కెమిస్ట్రీ, కంప్యూటర్స్ సైన్స్, బీఎస్సీ జువాలజీ కోర్సుల్లో చేరదలచి విద్యార్థులు గడువు ముగియక ముందే నిర్దేశిత ధ్రువపత్రాలతో కళాశాలకు రావాలన్నారు.

బదిలీ ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

- ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరావు



మాట్లాడుతున్న ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరావు

వీరఘట్టం: ఇటీవల బదిలీ అయినా కొత్త పాఠశాలల్లో చేరని ఉపాధ్యాయులను విద్యాశాఖ అధికారులు వెంటనే రిలీవ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్ను వెంకటరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. బదిలీ అయిన వారిని రిలీవ్ చేసి ఆయా స్థానాల్లో డీఎస్సీ- 2005 అభ్యర్థులను నియమించాలని కోరారు. అలాగే 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానం అమలు చేయడంతో పాటు డీఏలు, సరెండర్ లీవ్‌ల బకాయిలు చెల్లించాలన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ నాయకులు అంపోలు సూర్యనారాయణ, గునాన దుర్గాప్రసాద్, అన్ను ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతిసాగుపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీ నాగేశ్వరరావు

భామిని: మండలంలోని మూలగూడలో ఆదివాసీ గిరిజనులకు ప్రకృతి సాగుపై సోమవారం అవగాహన కల్పించారు. వెలుగు అసోసియేషన్ రిసోర్స్‌పర్సన్ పి.నాగేశ్వరరావు, ఏపీసీఎన్ఎఫ్ టీఏ మోటక అంబోజీ ప్రకృతి సాగులో భాగంగా చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై వివరించారు. చిరుధాన్యాల సాగులో వినియోగించాల్సిన సేంద్రియ విధానాలపై తెలియజేశారు. అలాగే జీడి చెట్ల కొమ్మల కత్తిరింపు వల్ల కలిగే లాభాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెలుగు మండల కోఆర్డినేటర్ గోపాలరావు, సీసీ పకీరు, ఆదివాసీ గిరిజనులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో మెలగాలి



నడిమికెల్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ చంద్రమౌళి, ఎస్సై కళాధర్

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్ల గ్రామంలో గతేడాది వినాయక చవితి ఉత్సవాల్లో జరిగిన గొడవలను దృష్టిలో ఉంచుకుని సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సై జి.కళాధర్ మాట్లాడుతూ.. మనస్పర్థలను పక్కన బెట్టి ఐకమత్యంతో వినాయక చవితి జరుపుకోవాలని సూచించారు. అలాకాకుండా ఎవ్వరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవన్నారు.

గణేష్ దీక్షలు ప్రారంభం

వీరఘట్టం: వినాయక చవితి నవరాత్రులను పురస్కరించుకుని సోమవారం స్థానిక హనుమాన్ జంక్షన్‌లోని సాక్షి గణపతి దేవాలయంలో గణేష్ దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులకు యజ్ఞకర్త ఎస్‌వీఎస్ఎల్ శర్మయాజీ మాలధారణ చేశారు. 13 రోజుల పాటు మాలధారణ ఉంటుందని యజ్ఞకర్త శర్మయాజీ తెలిపారు.

